

'భూ భారతి'తో భూ సమస్యల పరిష్కారం
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా 6

ప్రజాప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం
- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ 6

- సెస్ స్టోర్స్ స్థలంలో నిర్మించిన రైతు బజార్ స్వాధీనానికి సిద్ధం
- నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన పదోన్నతులు, నియామకాలపై సమీక్ష
- 2025-26 అంచనా బడ్జెట్ రూ.678 కోట్లకు 51వ మహజన సభ ఆమోదం
- ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం కానివ్వం : సెస్ చైర్మన్ చిక్కాల రామారావు



మాట్లాడుతున్న గ్రామ ప్రతినిధులు

వాడీవేడిగా చర్చ..

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

విద్యుత్ సమస్యలు, చేపట్టబోయే పనులు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లూజ్‌వైర్లు, ఇతర సమస్యలపై వాడివేడీగా చర్చ సాగింది. సెస్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై బాధ్యులపై చర్యలు ఏవని ప్రశ్నించారు. సెస్ స్టోర్ స్థలంలో నిర్మించిన రైతు బజార్‌ను స్వాధీనం చేసుకోవాలని సెస్ గ్రామ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో గురువారం చైర్మన్ చిక్కాల రామారావు అధ్యక్షతన సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం 51వ మహాజన సభ జరిగింది. 20 అంశాలతో ప్రవేశపెట్టిన ఎజెండాపై చర్చలు జరిపి ఆమోదం తెలిపారు. 2025-2026 అంచనా బడ్జెట్ రూ.678 కోట్ల 39లక్షల 95 వేలను ఆమోదించారు. ఈసందర్భంగా సభ్యులు ఎజెండా అంశాలపై మొదట చర్చ లేకుండానే చప్పట్లతో ఆమోదం తెలుపుతున్న క్రమంలో పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. చర్చ జరిగిన తర్వాత ఆమోదం ప్రకటించాలని సెస్ సిరిసిల్ల ప్రతినిధులు సత్యనారాయణ, సత్తార్, సంపత్‌రావు, నారాయణలు డిమాండ్ చేశారు.

దీంతో సెస్ చైర్మన్ రామారావు ఎజెండాలోని అంశాల వారీగా చర్చలు జరుపుదామని అనుమతి ఇచ్చారు. ప్రతినిధి సత్యనారాయణ మాట్లాడుతూ సెస్ స్టోర్‌కు సంబంధించిన స్థలం మూడెకరాలు ప్రభుత్వం స్వాధీనం చేసుకొని రైతుబజార్ నిర్మిం చిందని, దానికి బదులుగా స్థలం ఇవ్వలేదని, తిరిగి రైతు బజార్‌ను స్వాధీనం చేసుకోవాలన్నారు. దీంతో పాటు ఎల్లారెడ్డిపేటలో పోలీస్ ఆధీనంలో ఉన్న సేవాసదన్‌ను కూడా తీసుకోవాలని పలువురు ప్రతి నిధులు డిమాండ్ చేశారు. రైతు బజార్‌ను స్థలంలోనే తిరిగి స్టోర్‌ను నిర్మించడానికి ఆందోళనకు సైతం సిద్ధమంటూ పలువురు ప్రతినిధులు తెలిపారు. సెస్ చైర్మన్ సోమవారం తరువాత కలెక్టర్, ఇతర ప్రతి నిధులు దృష్టికి తీసుకవెళ్లి చర్యలు తీసుకుందామని తెలిపారు. ఎల్లారెడ్డిపేట సేవాసదన్ కోసం పోలీస్ డిపార్ట్‌మెంట్ ఎస్పీలను కలిశామని, ఈసారి గట్టిగా ప్రయత్నం చేద్దామన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

సెస్‌లో అగ్నిప్రమాదం జరిగిన సంఘటనలో బాధ్యులను సస్పెండ్ చే యాలని పలువురు డిమాండ్ చేశారు. చైర్మన్ సమాధానం ఇస్తూ అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశామని, విచారణ రిపోర్ట్ ఇంతవరకు ఇవ్వలేదని, రాగానే చర్యలు తీసుకుంటామన్నారు.

ముస్తాబాద్ గ్రామ ప్రతినిధి కల్వకుంట్ల గోపాల్‌రావు మాట్లాడుతూ మల్లన్నసాగర్ కాలువల్లోకి నీళ్లు వస్తున్నాయని, రైతులు మోటార్లు పెట్టుకోవడం ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పెరిగి వ్యవసాయ కనెక్షన్ దారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, అదనంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటుచేయాలన్నారు. చైర్మన్ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయాలంటే ఇరిగేషన్ నుంచి అనుమతి అవసరం అవుతుందన్నారు. ప్రస్తుతం వ్యవసాయానికి 7 హెచ్‌పీ వరకు రాయితీ వస్తుందని, 15 హెచ్‌పీల వరకు కూడా వాడుతున్నారన్నారు. అదనంగా బోర్‌లు వేస్తే వ్యవసాయ కనెక్షన్లు తీసుకోవాలని కోరారు. బకాయిల వసూళ్లకు సహకరించాలన్నారు. ప్రతినిధి సంపత్‌రావు మాట్లాడుతూ గ్రామ ప్రతినిధులకు సభకు హాజరుకావడానికి నోటీస్ ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. ఆహ్వానం పంపాలని గత మహా సభలోనే చెప్పామన్నారు. మహాసభ నివేదిక వారంరోజుల ముందే పంపించాలన్నారు.

ప్రతినిధి లక్ష్మణ్, కాంతారెడ్డిలు మాట్లాడుతూ మిడిల్ పోల్స్ వేయాలని, ఐరన్ పోల్స్ తొలగించాలని కోరారు. అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు వేయాలన్నారు. ప్రతినిధి పద్మారెడ్డి మాట్లాడుతూ లూజ్ వైర్ల సమస్యను పరిష్కరించడంతో పాటు పొలాల్లో ఉన్న ట్రాన్స్ ఫార్మర్లను రోడ్లవైపు మార్చాలని కోరారు. చైర్మన్ మాట్లాడుతూ 8వేల మిడిల్ పోల్స్‌లను దశల వారీగా కొనుగోలు చేసి ఏర్పాటు చేస్తామ న్నారు. మొదటి విడతగా 500 కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలుకు ప్రతి పాదించామన్నారు. వివిధ అంశాలపై సభ్యులు చర్చలు జరిపారు. మహాసభలో సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్లు దిడ్డి రమాదేవి, దార్నం లక్ష్మీనారాయణ, మల్లుగారి రవీందర్‌రెడ్డి, గౌరినేని నారాయణరావు, వరుస కృష్ణహరి, సందుపట్ల అంజిరెడ్డి, మాడుగుల మల్లేశం, పొన్నాల శ్రీనివాసరావు, ఆకుల గంగారాం, నామాల ఉమ, రేగులపాటి హరిచరణ్‌రావు, ఆకుల దేవరాజం, పొట్టిపల్లి సుధాకర్, ఏవో శ్రీనివాసరెడ్డి, డీఈ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీడీసీఎల్ కంటే మెరుగైన సేవలు

సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

ఎన్‌పీడీసీఎఫ్, ఎస్పీడీసీఎల్ కంటే సెస్ పరిధిలో మెరుగైన సేవలు అందిస్తున్నామని, సెస్‌కు సంబంధం లేనివారు ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం చేయాలంటూ వినియోగదారులను తప్పుదారి పట్టించే మాటలు మాట్లాడుతున్నారని చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. మహాసభను ప్రారంభిస్తూ ఎన్‌పీడీసీఎల్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ విలీనం కానివ్వమని అన్నారు. మరింత బలోపేతంగా పనిచేస్తామన్నారు. సెస్ పరిధిలో ఎలాంటి పైరవీలు, తప్పులు జరగకుండా ఎన్‌పీడీసీఎల్ ద్వారా భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం, నియామకాలు చేపడుతామన్నారు. బకాయిల వసూళ్లకు గ్రామ ప్రతినిధులు, వినియోగదారులు సహకరించాలన్నారు. వినియోగదారుల నుంచి రూ.162 కోట్లు బకాయిలు రావాల్సి ఉందని, ప్రభుత్వం నుంచి రూ.625 కోట్లు రావాల్సి ఉందని అన్నారు. విద్యుత్ సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలు పోను సెస్‌కు రూ.250 కోట్ల వరకు మిగులు ఉంటుందన్నారు. సెస్ స్టోర్‌కు సంబంధించి మూడెకరాల స్థలాన్ని జిల్లాల పునర్విభజనలో స్వాధీనం చేసుకొని స్టోర్‌కు ఎలాంటి స్థలాన్ని కేటాయించలేదని, ఐదెకరాల స్థలంతో పాటు రూ.10 కోట్లు బడ్జెట్ కేటాయించే విధంగా తీర్మానం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఎల్లారెడ్డిపేట సేవాసదన్ 1987 నుంచి పోలీస్ శాఖ ఆధీనంలో ఉందని, తిరిగి స్వాధీనం చేసుకోవడంతో పాటు ప్రతి మండల కేంద్రంలో 15 గుంటల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించే విధంగా నివేదించడం, కేటాయించని పక్షంలో సొంత నిధులతో కొనుగోలు చేసి సేవా సదన్‌లను నిర్మిస్తామన్నారు. సిరిసిల్లలో పవర్‌లూం పరిశ్రమకు విద్యుత్ సరఫరా అందిస్తూ చేయూతను ఇస్తున్నామని టెక్స్‌టైల్ పార్కు, అపెరల్ పార్కుకు ప్రత్యేక సబ్‌స్టేషన్ ద్వారా నిరంతర విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు.

మిగతా 6వ పేజీలో

ఆమోదించిన ఎజెండా అంశాలు..

- 2023- 2024 సంవత్సరానికి జమ ఖర్చులు, ఆస్తి, అప్పులు, బడ్జెట్, సభ్యుల వాటాధనం
- 2025-2026 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ రూ.678 కోట్ల 39లక్షల 95వేల
- ఉద్యోగుల సర్వీస్ నియమావళి కోసం బైలాస్ సవరణ
- సిరిసిల్ల సెస్ ప్రధాన కార్యాలయం మరమ్మతులు, పెయింటింగ్ పనులు
- సెస్ స్టోర్ నిర్మాణానికి ఐదెకరాల స్థలం, రూ.10 కోట్ల బడ్జెట్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి.
- ఎల్లారెడ్డిపేటలో పోలీస్ ఆధీనంలో ఉన్న సెస్ సేవాసదనాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం.
- సెస్ సంస్థలో బైలా, చట్ట విరుద్ధంగా చేపట్టిన నియామకాలు పదోన్నతులపై పునః సమీక్ష, విచారణకు కమిటీ.
- 8వేల మిడిల్ పోల్స్ దశల వారీగా కొనుగోలు.
- మొదటి విడతగా 500 కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలు.
- సెస్ పరిధిలో పురాతనమైన వైరును తొలగించడం.
- ప్రొబేషన్ పూర్తి చేసుకున్న అసిస్టెంట్ హెల్పర్లను హెల్పర్‌లుగా పదోన్నతులు కల్పించడం.
- నూతన మండలాల్లో సేవాసదన్‌లు ఏర్పాటుకు స్థలం లేనిచోట 15 గుంటల స్థలాన్ని కేటాయించడానికి ప్రభుత్వాన్ని కోరడం, కేటాయించని పక్షంలో సెస్ నిధులతో కొనుగోలు
- పహల్గాం మృతులకు నివాళి, ఉగ్ర దాడిపై ఖండన.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచడంతోపాటు నాణ్యమైన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు రాకుండా ధాన్యాన్ని కొనుగోళ్లు చేపట్టాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే చెల్లింపులు పూర్తిచేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 246 కొనుగోలు కేంద్రాలకు 244 కొనుగోలు కేంద్రాలను ప్రారంభం చేసి కొనుగోలు కేంద్రాలనుంచి 28వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్‌లు సిరిసిల్లలోని అపెరల్ పార్క్‌తోపాటు ఇతర చోట్ల తాత్కాలిక గోదాములను గుర్తించి ధాన్యాన్ని తరలింపు చేపట్టాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు ట్యాగ్ చేసిన రైస్‌మిల్లర్లకు సామర్థ్యం ప్రకారం ధాన్యం కేటాయించి భద్రత కల్పించాలన్నారు. జిల్లాలో నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంవద్ద రెండు లారీలను అందుబాటులో ఉంచాలన్నారు. రానున్న పది రోజుల్లో వర్షాలు లేవని వాతావరణ శాఖ వెల్లడించినందున రైతులు ఆందోళన చెందవద్దని అన్ని సెంటర్‌లల్లో కవర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, పౌర సరఫరాల శాఖ అధికారులు రజిత, వసంత లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని అపెరల్ పార్క్ షెడ్లకు తరలించాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే అపెరల్ పార్క్‌లోని వీవింగ్ షెడ్‌లను తరలించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని అపెరల్ పార్క్‌లోని వీవింగ్ షెడ్‌లను గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా షెడ్‌లలో ధాన్యం నిల్వ చేసేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు అన్‌లోడ్‌చేయాలని సూచించారు. హమాలీలకు తాగునీరు తదితర మౌలిక వసతులను కల్పించాలని ఆదేశాలను జారీ చేశారు. అపెరల్ పార్క్‌లోని అరుషెడ్లు, 12 కంపార్ట్‌మెంట్‌లను సిద్ధంగా ఉంచామని పౌరసరఫరాల శాఖ డీఎం రజిత తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

గంభీరావుపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్, దేశాయిపేట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తనిఖీ చేశారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలింపు కోసం రెండు వాహనాలను కేటాయించామని తెలిపారు. ధాన్యం తరలించటానికి వాహనాల కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తూకం వేయాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల కోసం కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఉదయం, సాయంత్రం వేళల్లో హమాలీలు పనిచేయాలని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలంటూ రోడ్డెక్కిన రైతులు



కలెక్టరేట్ ఎదుట ధర్నాచేస్తున్న రైతులు



ముస్తాఫనగర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు



చందుర్తిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో నెలరోజులుగా ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ రైతులు గురువారం రోడ్డెక్కారు. సిరిసిల్ల కలెక్టరేట్‌కు గురువారం వీర్నపల్లి మండలానికి చెందిన సుమారు వంద మంది రైతులు కలెక్టర్‌ను కలిసేందుకు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట రైతులను అడ్డుకున్నారు. దీంతో రైతులు అక్కడే బైఠాయించి గంటపాటు ధర్నా చేశారు. జిల్లా అధికారులు రాకపోవడంతో ఆగ్రహించిన రైతులు సిరిసిల్ల-వేములవాడ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోవడంతో టౌన్ సీఐ కృష్ణ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడి కలెక్టర్ దగ్గరికి 10 మంది రైతులను తీసుకెళ్లి కల్పిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు. అనంతరం పదిమంది రైతులు కలెక్టర్‌ను కలిసి వీర్నపల్లి మండలంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాల్లో నెలరోజుగా ధాన్యం పోసిన ఇంత వరకు కొనుగోలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. అంతేకాకుండా ధాన్యంపై కోతులతోపాటు అడవిపందులు దాడిచేసి ధాన్యాన్ని తినేస్తున్నాయని, ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుగులోతు సురేష్‌నాయక్, రెడ్డి సంఘం అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, మాజీసర్పంచ్ కుంటయ్య, కెలోతు గంగాధర్, తిరుపతి, గన్యా, లక్ష్మన్, రాములు, నారాయణరెడ్డి, ద్యావ మహిపాల్‌రెడ్డి, ఎండి హుస్సేన్, దేవయ్య, ఆకుల సత్యం, మల్లారెడ్డి, జింక రవి తదితరులు పాల్గొన్నారు.

- గంభీరావుపేట : గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్‌లోని కొనుగోలు కేంద్రంవద్ద గురువారం రైతులు రాస్తారోకో చేపట్టారు. తూకంవేసిన ధాన్యం తరలించకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోయారు. తక్షణమే తూకంవేసిన ధాన్యాన్ని తరలించాలని చేయాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి-సిద్దిపేట ప్రధాన రహదారిపై ధాన్యం బస్తాలతో బైఠాయించి ఆందోళన చేయడంతో స్థానిక ఎస్ఐ ప్రేమానందం సిబ్బందితో చేరుకుని సముదాయించారు. ఫోన్‌లో తహసీల్దార్‌తో రైతులను మాట్లాడించారు. ప్రతిరోజు ధాన్యం తరలించడానికి వాహనాలను పంపిస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.
- వీర్నపల్లి : వీర్నపల్లి మండలం వన్‌పల్లిలో వరి ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ రైతులు గురువారం ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ముట్టడించేందుకు వెళ్తున్న రైతులను సముదాయించేందుకు వచ్చిన మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్‌ను ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయడం లేదంటూ నిలదీశారు. రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి అగ్రిమెంట్ ఇవ్వకపోవడంతో కొనుగోళ్లలో జాప్యం జరిగిందని, వెంటనే ధాన్యం కొనుగోలు చేస్తామని రాములు నాయక్ చెప్పినా రైతులు వినలేదు. సుమారు 100మంది రైతులు ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ సిరిసిల్ల కలెక్టరేట్ ముట్టడికి వెళ్లారు. రైతులు నర్సారెడ్డి, సుమన్‌రెడ్డి, పర్శరాములు, కుంటయ్య, దేవేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఆకుల సత్తన్న, గంగాధర్, తిరుపతి, గంగు లక్ష్మణ్, రమేష్, దేవయ్య, ఎండి హుస్సేన్, జింక రవి, గొల్ల రాములు, తదితరులు ఉన్నారు.
- చందుర్తి : ధాన్యం కొనుగోలు చేయాలని మండల కేంద్రంలో రైతులు ఆందోళన చేపట్టారు. కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిపై గురువారం రాస్తారోకో చేపట్టారు. పోలీసులు చేరుకొని రైతులతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు. అనంతరం ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు సిరికొండ శ్రీనివాస్, మార్త సత్తయ్య, మర్రి రాజు, మెంగని రవి, మర్రి రాములు, మర్రిమల్లేశం, మర్రి రమేష్, మార్త గంగాధర్, లక్ష్మీరాజం మల్లేశం, రవిందర్‌రెడ్డి, కమలాకర్, రాజేశం, భూమయ్య, లస్మయ్య, శ్రీహరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక పరిపక్వత పెంపొందించుకోవాలి

- అవగాహన సదస్సులో ఎస్పీ మహేశ్ బీ గితే



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్ బి. గితే

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరు మానసిక పరిపక్వత పెంపొందించుకోవాలని ఎస్పీ మహేశ్ బీ గితే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో డీజీపీ జితెందర్ ఆదేశాల మేరకు గురువారం మానసిక ఆరోగ్య అవగాహన సదస్సును ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్, ఆర్మడ్ పోలీస్ సిబ్బంది పాత్ర కీలకమన్నారు. సిబ్బంది సంక్షేమానికి తెలంగాణ పోలీస్‌శాఖ కట్టుబడి ఉందన్నారు. అధికారులు, సిబ్బంది మానసిక స్థితి, ఆరోగ్యం కాపాడటం అనేది తక్షణ ఆవశ్యకతగా గుర్తించి సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. పోలీసు సిబ్బందికి శాఖ పరమైన, వ్యక్తిగత సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. అనంతరం వివిధ అంశాలపై మానసిక నిపుణులు డాక్టర్ అశోక్ కుమార్ బృందం అవగాహన కల్పించారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆత్మహత్యల నివారణ సంస్థ చైర్మన్ డాక్టర్ అశోక్, సభ్యులు రామకృష్ణ, సైకాలజిస్టులు శైలజ, రామోజీరావు, బోడా అరుణ, సీఐలు మొగిలి, మధుకర్, ఆర్ఐలు రమేశ్, మధుకర్, యాదగిరి, ఎస్ఐలు రమాకాంత్,రాంమ్మోహన్, ప్రశాంత్‌రెడ్డి, శ్రీకాంత్, ఆర్ఎస్ఐలు శ్రవణ్, సాయికిరణ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం

వేములవాడ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం వేములవాడ పట్టణ పరిధిలోని శాత్రాజ్‌పల్లిలో గురువారం జరిగింది. 1,2,3వార్డులకు సంబంధించిన ముఖ్య నాయకులతో ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, మాజీ కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి పెద్ద ఎత్తున తరలివెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో 1,2 వార్డుల పార్టీ అధ్యక్షులు నల్ల సతీష్‌రెడ్డి, గుడిసె అనీల్, మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీనివాస్, గుడిసె సదానందం, మెట్ట దేవానందు, జనార్ధన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, పురుషోత్తం, మనోజ్, సుదగోని బాలయ్య,కొమురయ్య, రామచంద్రం, అబ్దుల్‌ఖయ్యుం, గోరెమియా, స్వామిరెడ్డి, మహేందర్, వీరేందర్, విక్కుర్తి సాయిగౌడ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

28లోగా గుర్తింపులేని పార్టీల వివరాలను అందించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి లౌకుష్‌యాదవ్

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గుర్తింపులేని పార్టీల వివరాలను ఈనెల 28లోగా అందించాలని భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి లౌకుష్‌యాదవ్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఢిల్లీనుంచి భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి లౌకుష్‌యాదవ్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్‌లేకుండా గుర్తింపులేని రాజకీయ పార్టీల వివరాలను జిల్లా ఎన్నికల అధికారులు సేకరించి ఏప్రిల్ 28వ తేదీలోగా భారత ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని సూచించారు. జిల్లాలో గుర్తింపు లేని రాజకీయ పార్టీల అడ్రస్‌లో సంబంధత పార్టీలు లేని పక్షంలో ఆ వివరాలను కూడా అందించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎన్నికల సంబంధిత అధికారులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు మొదటి ప్రాధాన్యం : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మొదటి బహుమతి అందుకుంటున్న శాట్ జట్టు క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు మొదటి ప్రాధాన్యం ఇస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వాలీబాల్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ప్రారంభించిన జిల్లా స్థాయి ఆహ్వానిత వాలీబాల్ టోర్నమెంట్ గురువారం సాయంత్రం ముగిసింది. శాట్ ఏ జట్టు మొదటి స్థానం, సిరిసిల్ల వీటీపీ జట్టు రెండవ స్థానం, గంభీరావుపేట జట్టు మూడవ స్థానం, రుద్రంగి జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. బహుమతుల ప్రదానం మహోత్సవానికి విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడారు. గ్రామీణ క్రీడలను క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడలను నిర్వహించడానికి తన సహకారం ఉంటుందన్నారు. అనంతరం విజేత జట్టులకు ముఖ్య అతిథులు ట్రోఫీలతో పాటు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టౌన్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బుర్ర నారాయణగౌడ్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, ప్రధాన కార్యదర్శి అజ్మీరా రాందాస్, ఉపాధ్యక్షులు చింతకింది శ్యాంకుమార్, గంగ మహేష్, డీ లక్ష్మీనారాయణ, కోశాధికారి కోడం శ్రీనివాస్, డాక్టర్ లక్ష్మణ్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం చేసిన యువకులు

● ప్రయాణికుడిపై దాడి
● కేసు నమోదు చేసిన పోలీసులు

గన్నేరువరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాత్రివేళ రోడ్డుపై డ్యాన్స్‌లు చేస్తూ బస్సుకు సైడ్ ఇవ్వమని అడిగినందుకు బస్సు అద్దాలను ధ్వంసం చేయడంతోపాటు ప్రయాణికుడిపై దాడి చేసిన సంఘటన మండలంలోని జంగపల్లిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి కరీంనగర్ నుంచి చొక్కారావుపల్లికి వెళుతున్న లాస్ట్‌ట్రిప్పు ఆర్టీసీ బస్సు (టీఎస్02యుబీ7429) జంగపల్లి గ్రామానికి చేరుకుంది. అదే సమయంలో స్థానిక ముదిరాజ్ కులస్థులు పెద్దమ్మ బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్నారు. డ్రైవర్ బస్సును చాలా సమయం రోడ్డుపై నిలిపి వేచిచూశాడు. బస్సులోని ప్రయాణికులు బస్సును ముందుకు నడిపించాలని డ్రైవర్‌ను కోరగా డ్రైవర్ మొండయ్య, కండక్టర్ ప్రవీణ్‌తోపాటు విధులు ముగించుకొని అదేబస్సులో వస్తున్న మైలారంకు చెందిన మరోడ్రైవర్ పులి అనిల్ బస్సుకు దారి ఇవ్వమని అడిగారు. దీంతో ముదిరాజ్ కులస్థులైన చింతల రమేష్‌తోపాటు మరికొందరు యువకులు బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. పులి అనిల్‌పై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో బస్సు డ్రైవర్ మొండయ్య ధ్వంసమైన బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించి పోలీసులకు విషయాన్ని తెలిపాడు. డ్రైవర్ మొండయ్య ఫిర్యాదు మేరకు చింతల రమేష్, మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

తాగునీటి ఎద్దడిపై ఖాళీ బిందెలతో నిరసన



నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

గంభీరావుపేట ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని 9వ వార్డులో తాగునీటి సమస్యపై మహిళలు ఖాళీ బిందెలతో గురువారం నిరసన వ్యక్తం చేశారు. నెల రోజులుగా తాగునీరు రాక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ కనెక్షన్ కూడా లేదని, ఈ విషయం సంబంధిత అధికారులతో ఎన్నోసార్లు చెప్పానమని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోని మంచినీటి సమస్యను తీర్చాలని డిమాండ్ చేశారు.

కూరగాయల సాగులో మహిళా రైతులు



● నేరుగా మార్కెట్‌లో విక్రయాలు ● నెలకు రూ.30 వేల ఆదాయం

మల్లాపూర్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామానికి చెందిన పలువురు మహిళా రైతులు కూరగాయలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మెట్‌పల్లి డివిజన్‌లో కూరగాయల సాగులో మొగిలిపేట గ్రామం రెండో స్థానంలో ఉంది. గ్రామంలో సుమారు 50 ఎకరాల్లో మహిళా రైతులు వివిధ రకాల కూరగాయలు సాగు చూస్తూ దళారులకు కాకుండా నేరుగా మార్కెట్‌కు వెళ్లి విక్రయాలు చేస్తున్నారు. 20 మంది మహిళా రైతులు తమకున్న వ్యవసాయ భూమిలో మిర్చి, టమాటో, క్యారెట్, క్యాబేజీ, వంకాయ, సోరకాయలతో పలు రకాల ఆకు కూరలను పండిస్తు న్నారు. పండించిన కూరగాయలను నేరుగా మెట్‌పల్లి, మల్లాపూర్, నిర్మల్ జిల్లా ఖానాపూర్ తదితర మార్కెట్లకు వెళ్లి విక్రయిస్తున్నారు. నెలకు రూ.30 వేల వరకు సంపాదిస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు.



మొగిలిపేటలో మహిళా రైతులు సాగు చేస్తున్న కూరగాయల పంటలు

కూరగాయల సాగు లాభాదాయకం
-సామ రాధ, రైతు, మొగిలిపేట



మిగిలిన పంటలతో పోలిస్తే కూరగాయాల సాగు లాభదాయకంగా ఉంటుంది. దళారులకు కాకుండా నేరుగా మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు అమ్ముకోవడంతో మరింత లాభాలు వస్తాయి. ప్రతి రోజు ఉదయం తోటకు వెళ్లి నీరు పెట్టి పండిన కూరగాయలను మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముతా.



మార్కెట్‌లో కూరగాయలను విక్రయిస్తున్న మహిళా రైతులు

నెలకు రూ.30 వేల ఆదాయం
-దామెర లత, రైతు, మొగిలిపేట



గ్రామంలో 20 మంది మహిళా రైతులం కలిసి పండించిన కూరగాయలను మార్కెట్లకు వెళ్లి విక్రయిస్తాం. నెలకు సుమారు రూ.30 వేల ఆదాయం వస్తుంది. మాకున్న వ్యవసాయ భూమిలో మిర్చి, టమాటో, క్యారెట్, క్యాబేజీ, వంకాయ, సోరకాయలతో పలు రకాల ఆకు కూరలు పండిస్తా.

అల్లునూరులో 60 బస్తాల ధాన్యం చోరీ

తిమ్మాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అల్గునూర్‌లో ఓ రైతు ఖాళీస్థలంలో ఆరబోసుకున్న వరిధాన్యాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. అలుగునూర్‌కి చెందిన ముంజ రాములు మూడురోజుల క్రితం వరికోసి వచ్చిన ధాన్యాన్ని వెంకటే శ్వరకాలనీ సమీపంలో ఓఖాళీ స్థలంలో ఆరబోసుకున్నాడు. అయితే రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆర బెట్టుకున్న ధాన్యంలో సుమారు 60బస్తాల ధాన్యం ఎత్తుకెళ్లారు. ధాన్యం విలువ సుమారు 50వేల రూపాయల ఉంటుందని రైతు రాములు వాపోయాడు. సంఘటన స్థలంలో కొన్ని సంచులు నింపిఉన్నాయి. ధాన్యం తీసుకెళ్లిన వారి చెప్పులు అక్కడే విడిచిపోయారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కొద్ది రోజులుగా అలుగునూర్‌తోపాటు తిమ్మాపూర్ మండలంలో చోరీలు ఎక్కు వగా జరుగుతున్నాయి. అలుగునూర్‌లో ఈ మధ్య రెండు బైక్‌లు, ఎల్ఎండీ కాలనీలోని సీఎస్ఐ ఆల్ సెయింట్ చర్చిలో దొంగలు పడి హుండీని ఎత్తుకెళ్లారు. మిర్చియార్డులో దొంగలుపడి రూ.80వేల నగదు ఎత్తుకెళ్లారు. పలుగ్రామాల ఆలయాల్లో బంగారు, వెండి వస్తువులు ఎత్తుకెళ్లిన సంఘటనలు ఉన్నాయి.

చెట్లను తొలగించిన సెస్ సిబ్బందిపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ అనుమతి లేకుండా రోడ్డుకిరువైపులా పెరిగిన చెట్లను తొలగించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి, రాజన్నపేటకు చెందిన సెస్ సిబ్బంది దాసరి బాబు, ద్యాప లక్ష్మణ్ లపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ గురువారం తెలిపారు. గ్రామంలో ప్రభుత్వ నిధులతో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించారని పేర్కొన్నారు. చెట్లను నరికి వేయడంతో సుమారు రూ.1,00,978 నష్టం వాటిల్లిందని పేర్కొంటూ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

కలెక్టర్ గారూ..! మాకు మీరే న్యాయం చేయాలి..

శంకరపట్నం, ఏప్రిల్ 24 (ఆంధజ్యోతి): కలెక్టర్ గారూ..! మాకు మీరే న్యాయం చేయాలని జాతీయ రహదారి-563లో నివేశనస్థలాలు కోల్పోతున్న నిర్వాసితులు వేడుకున్నారు. గురువారం శంకరపట్నంలో భూ భారతి కొత్తచట్టంపై రైతుఅవగాహన సదస్సుకు వచ్చిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి కేశవపట్నంలోని సర్వే నంబర్ 552లో నివేశనస్థలాలను కోల్పోతున్న నిర్వాసితులు వినతిపత్రం అందజేసి, తమగోడు వెళ్లబోసుకున్నారు. తమస్థలాలకు మూడేళ్లక్రితమే వాస్తవ బహిరంగ మార్కెట్ ధర చదరపు గజానికి రూ.20వేలు పలుకగా, జాతీయరహదారి విస్తరణలో భాగంగా సేకరించిన తమ ఓపెన్‌ప్లాట్లకు మాత్రం 2013మార్కెట్ వాల్యూ ప్రకారం అధికారులు చదరపు గజానికి కేవలం రూ.1221 మాత్రమే నష్టపరిహారంగా చెల్లించి చేతులు దులుపుకున్నారన్నారు. 2013నుంచి పరిహారం చెల్లించే సమయంవరకు అధికారులు మార్కెట్‌వాల్యూను కూడా రివైజ్ చేయలేదన్నారు. అంతేకాక ప్రధానరహదారికి పక్కన ఒకవైపు మిషన్ భగీరథ పైపులైను వేయడంతో కేవలం తమవైపు మాత్రమే అధికమొత్తంలో స్థలాలను కోల్పోయామన్నారు. మా పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం పైసాపైసా పోగుచేసి కూడబెట్టిన కష్టార్జితంతో ఈ ప్లాట్‌లను కొనుగోలు చేశామన్నారు. ఆర్బిట్రేషన్‌లో భాగంగా ప్రస్తుతం ఫైలు మీ పరిశీలనలో ఉన్నదని, మీరైనా కనికరించి వాస్తవ బహిరంగ మార్కెట్ వాల్యూ ప్రకారం ధర చెల్లించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పల్కల శ్రీనివాస్‌రెడ్డి, కొంపెల్లి మహేందర్‌రెడ్డి, పొన్నపూల రాజయ్య, జనగాం బుచ్చయ్య, నామని సంపత్, సిరిసేటి స్వరూప, గోపు మాధవి-శ్రీనివాస్‌రెడ్డి, కాటం వెంకటరమణారెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలంలో ద్విచక్ర వాహనాలను దొంగిలించిన జగిత్యాల పట్టణం వాణినగర్‌కు చెందిన గడ్డం ఆంజనేయులును పోలీసులు అరెస్ట్ చేశారు. ధరూర్ గ్రామానికి చెందిన కొత్తలక్ష్మీ, నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కడార్ల నరసింహచారి అనే ఇద్దరు వ్యక్తుల ద్విచక్ర వాహనాలను దొంగిలించిన ఆంజనేయులును అరెస్ట్ చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.

దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు

చందుర్తి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అల్లుడిపై దాడికి పాల్పడిన సంఘటనలో మామతో పాటు బామర్దిపై కేసు నమోదైన సంఘటన చందుర్తి పోలీస్ స్టేషన్‌లో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన నాగుల రాజు తన భార్యతో బుధవారం రాత్రి పశువులకు దాణా పెట్టడం విషయంలో గొడవ పడడంతో, భార్య తన కుమారుని తీసుకొని తల్లిగారి ఊరైన ఇదే మండలంలోని సనుగులకు వెళ్లింది. దీంతో రాజు భార్యను తీసుకరావడానికి సనుగుల గ్రామంలోని తన భార్య వద్దకు వెళ్లగా మామ బూర్ల మల్లయ్య, బామ్మర్ది బూర్ల పవన్‌లు రాజును కర్రతో చితికబాదడంతో తలకు, చేతికి గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడలోని ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్లయ్య, పవన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అంజయ్య తెలిపారు.

రేణికుంట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

● ప్రయాణికులతో వెళుతున్న ఆటోను ఢీకొన్న లారీ ● ఇద్దరు మృతి, మరో ఆరుగురికి తీవ్రగాయాలు



రేణికుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం



బీరెడ్డి నక్షత్రమ్మ(ఫైల్)



కాసర్ల తిరుపతి(ఫైల్)

తిమ్మాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంట వద్ద గురువారం ప్రయాణికులతో వెళుతున్న ఆటోను లారీ ఢీకొట్టింది. ఈప్రమాదంలో సంఘటన స్థలంలో ఒకరు, ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మరొకరు మృతిచెందారు. మరో ఆరుగురు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎల్ఎండీపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని చింతకుంటకు చెందిన కసర్ల తిరుపతి(55) గురువారం ఆటోలో ప్యాసింజర్ లను ఎక్కించుకొని బెజ్జంకి నుంచి కరీంనగర్ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామ శివారులో వేగంగా వస్తున్న బియ్యం లోడ్‌లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటలో ఆటోడ్రైవర్ కాసర్ల తిరుపతి అక్కడికక్కడే మృతిచెందగా ఆటోలో ప్రయాణి స్తున్న ఆరుగురు త్రీవంగా గాయపడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్సై వివేక్, బ్లూకోల్ట్స్ సిబ్బంది రాజు స్థానికుల సాయంతో క్షతగాత్రులను అంబులెన్సుల్లో కరీంనగర్‌లోని ఆసుపత్రులకు తరలించారు. ఇందులో ఆటోలో ప్రయాణిస్తున్న సిద్దిపేట జిల్లా బెజ్జంకి గ్రామానికిచెందిన బీరెడ్డి నక్ష త్రమ్మ (57) ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందింది. ఆటోలో ప్రయాణి స్తున్న ప్రయాణికులు బెజ్జంకి మండలం గుగ్గిళ్లకు చెందిన పున్నం సాయికిరణ్, బెజ్జంకికి చెందిన బీరెడ్డి ఆనందర్‌రెడ్డి, ఐలెని నవీన్‌రెడ్డి, కరీంనగర్‌లోని చింతకుంటకు చెందిన కసర్ల కరుణ, చింతకుంటకు చెందిన మౌనిక, బెజ్జంకి మండలం దాచారం గ్రామానికి చెందిన కొలిపాక మంజుల తీవ్రగాయాలతో ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్నారు. మృతుల కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు.. ప్రమాదానికి కారణమైన లారీని, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వివేక్ తెలిపారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ

సంఘట స్థలాన్ని కరీంనగర్‌రూరల్ ఏసీపీ శుభంప్రకాశ్ పరిశీలించారు. ప్రమాదం ఏలా జరిగింది అనే దానిపై ఎల్ఎండీ ఎస్సై వివేక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా డివైడర్ల వెంట లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంతో వెలుతురు లేక రోడ్డుప్రమాదాలు సంభ విస్తున్నాయని, వెంటనే లైట్లను ఏర్పాటు చేయాలని హెచ్‌కేఆర్ టోల్ ప్లాజా సిబ్బందిని ఏసీపీ ఆదేశించారు.

ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న కసర్ల తిరుపతి(55) తన కూతురు మౌనికకు పసిరికలు(జాండిస్) మందుకోసం భార్య కరుణతో కలిసి అంటకాలపల్లి వచ్చి వెళుతున్నాడు. ఈ ప్రమాదంలో తిరుపతి మృతి చెందగా, భార్య కరుణ, కూతురు మౌనిక తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బెజ్జంకి ఎక్స్ రోడ్డులో ఉంటున్న బీరెడ్డి నక్షత్రమ్మ ఈ మధ్యనే రేకుర్తిలో కంటికి చికిత్స చేయించుకుంది. గురువారం చెకప్‌కు వెళ్లేందుకు భర్త బీరెడ్డి ఆనంద్‌రెడ్డితో కలిసి ఆటోలో ఎక్కగా ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో మృతిచెందింది.

శాతవాహన యూనివర్సిటీ ఆవరణలో మంటలు



చెలరేగుతున్న మంటలు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం ఆవరణలో ఎండుగడ్డికి మంటలు అంటుకుని ఎస్‌యూ పాలనాభవనాల వరకు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకు న్న కరీంనగర్, మానకొండూర్, వేములవాడ ఫైర్ ఇంజన్‌లతో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పుతున్నారు. గురువారం ఉదయం 11:30 గంటల నుంచి రాత్రి వరకు మంటలను ఆర్పేందుకు ఫైర్ సిబ్బంది శ్రమిస్తున్నారు. ఒక వైపు మంటలను నీటితో అదుపులోకి తీసుకువస్తుండగా మరో వైపునకు మంటలు వ్యాపిస్తున్నాయి. అగ్నిమాపకశాఖ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లాఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి సంఘటనా స్థలంలోనే ఉండి అధికారులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్నారు. కరీంనగర్ ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో 20మందికిపైగా సిబ్బంది ఈ ఫైర్‌ఫైటింగ్‌లో పాల్గొన్నారు. ఎస్‌యూ విశాలమైన ఆవరణలో చెట్లు, గుట్టలు, ముళ్లపొదలు నిండిఉంటాయి. ప్రతి సంవత్సరం ఇలాగే రెండు మూడుసార్లు గడ్డికి, చెత్తకు మంటలు అంటుకుని అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఈ అగ్నిప్రమాదాలలో విలువైన, అరుదైన మొక్కలు కాలిపోతున్నాయి. అయినప్పటికీ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవటం లేదనే విమర్శలు వస్తున్నాయి. శాతవాహన విశ్వవిద్యాలయం 200 ఎకరాలలో విస్తరించి ఉన్నది. ఇక్కడ ఎలుగుబంట్లు, కొండగొర్రె, నెమళ్లు, కుందేళ్లు, కొండచిలువలు, పక్షులు నివసిస్తున్నాయి. అగ్నిప్రమాదాలు జరిగినపు డు జంతువులు, పక్షులకు ప్రాణసంకటంగా మారుతోంది.

కోతుల దాడిలో రైతుకు గాయాలు

కోనరావుపేట, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన రైతుపై కోతులు దాడి చేశాయి. గ్రామానికి చెందిన పుట్ట రాజారాంరెడ్డి అనే రైతు వ్యవసాయ క్షేత్రం వద్ద కూరగాయలు సాగు చేస్తున్నాడు. గురువారం ఉదయం ఒక్కసారిగా వందలాది కోతులు పంటపై దాడి చేస్తున్నాయి. వీటిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నించగా మూడు కోతులు రైతుపై దాడికి పాల్పడ్డాయి. కోతుల దాడిలో గాయపడిన రైతు కోనరావుపేటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు.

సారీ నాన్న.. నాకు బతకాలని లేదు

● అద్దంపై రాసి యువతి ఆత్మహత్య




ప్రసన్నలక్ష్మి (ఫైల్)

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సారీ నాన్న.. నాకు బతకాలని లేదు అంటూ జగిత్యాలకు చెందిన ఓ యువతి అద్దంపై రాసి గురువారం ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాల జిల్లా పోచమ్మ వాడకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రసన్నలక్ష్మి(28)కి వెల్లటూర్ మండలం రామునూరి గ్రామానికి చెందిన గాంధారి తిరుపతికి 2023లో వివాహం జరిగింది. దంపతులిద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కాగా వీరికి సంవత్సరం క్రితం బాబు జన్మించడంతో ప్రసన్నలక్ష్మి ఉద్యోగం మానేసింది. కొన్ని రోజుల క్రితం పుట్టింటికి వచ్చిన ప్రసన్నలక్ష్మి గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా తన కుమారుడిని తనభర్తకు గాని అత్తమామలకు గాని ఇవ్వొద్దని ఆత్మహత్యకు ముందు సూసైడ్‌నోట్ రాసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొన్ని రోజులుగా భర్తతోపాటు అత్త, మామ వేధింపులకు గురిచేయడంతోనే ప్రసన్నలక్ష్మి ఆత్మహత్యకు పాల్పడిందని బంధువులు ఆరోపిస్తున్నారు.

అవగాహనతోనే అడ్డుకట్ట

● వ్యాధి తీవ్రత తగ్గించడంపై చర్యలు
● నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మలేరియా ప్రపంచంలోనే అత్యంత ప్రాణాంతకమైన వ్యాధిల్లో ఒకటి. 2017లో ప్రపంచ వ్యాప్తంగా 21.9 కోట్లకుపైగా కేసులు, 4.35 లక్షల మరణాలకు కారణమైంది. ఈ సంఖ్యను తగ్గించడానికి, వ్యాధి దాని నివారణ గురించి అవగాహన పెంచడానికి ప్రపంచవ్యాప్తంగా చర్యలు తీసుకున్నారు. ప్రారంభ లక్షణాలు, జాగ్రత్తలు, చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పిస్తే వ్యాధిని తగ్గించవచ్చని గుర్తించారు. మలేరియా మరణాలను తగ్గించడంపై చాలా దేశాల్లో చర్యలు చేపట్టారు. ఇందుకు అనుగుణంగా మే 25న ప్రపంచ మలేరియా దినోత్సవం జరుపుకుంటున్నారు. ఇది ప్రపంచం దృష్టిని ఆకర్షించడానికి, ప్రజలు ప్రభావితమయ్యే తీవ్రతను తగ్గించడంలో సహాయం చేయడానికి ఒక వేదికగా నిలిచింది. కొవిడ్ కారణంగా మలేరియా సేవలలో కొంత అంతరాయం కలిగింది. దాంతో గతంలో కంటే వేయి కేసులు పెరిగాయి. మలేరియా అనే పరాన్నజీవి ఇన్ఫెక్షన్ ఆడ(అనాఫిలిస్)దోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఇది తీవ్రమై కొన్నిసార్లు ప్రాణాంతక అనారోగ్యానికి కారమణమవుతుందని వైద్య నిపుణులు తెలియచేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 200 కోట్ల మంది మలేరియా బారిన పడుతున్నారనే అంచనా ఉన్నది. 2008లో తొలిసారిగా మే 25న ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు.



● **జిల్లాలో తగ్గిన కేసులు**

జిల్లాలో మలేరియా కేసులు క్రమంగా తగ్గుతున్నాయని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు తెలియచేస్తున్నారు. 2019 నుంచి క్రమక్రమంగా మలేరియా కేసులు తగ్గుతున్నట్లు అధి కారిక లెక్కలు చెబుతున్నాయి. సంవత్సరానికి ఒకటి రెండు చొప్పున నమోదు అయ్యాయని, అది వలస కార్మికులని వైద్య శాఖ అధికారులు పేర్కొంటున్నారు. 2024లో 83,872 మందికి రక్త పరీక్షలు చేశామని, ఈ సంవత్సరం ఇప్పటి వరకు 24,674 మందికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

● **మలేరియా నివారణ**

రాత్రిపూట బయట ఉంటే పొడువాటి చేతుల దుస్తులు, ప్యాంటు వాడాలి. మంచంపై దోమతెరలు కట్టుకోవాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిలిచి ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నీటి తొట్టిలను ఎల్లప్పుడూ మూతతో కప్పిఉంచాలి.

ఆర్టీసీ కరీంనగర్-2 డిపోకు అత్యుత్తమ కేఎంపీఎల్ అవార్డు



ఆర్టీసీ ఎండీచేతుల మీదుగా అత్యుత్తమ అవార్డు అందుకుంటున్న కరీంనగర్ ఆర్టీసీ అధికారులు

భగత్‌నగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కరీంనగర్-2 డిపోకు అశోక్ లీలాండ్ సంస్థచే అత్యుత్తమ కేఎంపిఎల్, మైలేజ్ అవార్డును హైదరాబాద్ ఆర్టీసీ ఎండి వీసీ సజ్జనార్ చేతుల మీదుగా కరీంనగర్ ఆర్టీసీ అధికారులు అందుకున్నారు. హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో నిర్వహించిన టెక్నికల్ సెమినార్‌లోబిఎస్-6 బస్సుల అత్యుత్తమ హెచ్ఎస్‌డి కేఎంపిఎల్ 5.86 సాధించినందుకు, అశోక్ లీలాండ్ ఇంజిన్ నందు హైమైలేజ్ 20.40 లక్షల కిలోమీటర్లను సాధించినందుకు రాష్ట్రస్థాయిలో అవార్డులను కరీంనగర్-2 డిపో సాధించింది. ఎండీ చేతుల మీదుగా కరీంనగర్ ఆర్ఎం బి రాజు, కరీంనగర్-2 డిపోమేనేజర్ శ్రీనివాస్, గతంలో పనిచేసిన వి మల్లయ్య అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు మునిశేఖర్, సోలమన్, ఖుస్రోషాఖాన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

● 165 గ్రాముల గంజాయి స్వాధీనం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని నాందేడు పట్టణంలో గంజాయి కొనుగోలు చేసి రైలులో కోరుట్లకు చేరుకున్న ఇద్దరు వ్యక్తులను కోరుట్ల పోలీసులు అరెస్టు చేశారు. గురువారం కోరుట్ల పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఎస్ఐ శ్రీకాంత్ వివరాలను వెల్లడించారు. కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన గాజుల లిఖేష్ అదే గ్రామానికి చెందిన బాలుడు తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి కోరుట్ల, కథలాపూర్ మండలంతో పాటు కోరుట్ల పట్టణంలో యువకులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. లిఖేష్‌తో పాటు బాలుడు మహారాష్ట్రలోని నాందేడు వెళ్లి అక్కడ 164 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి బుధవారం రాత్రి కోరుట్ల పట్టణానికి చేరుకున్నట్లు తెలిపారు. పక్కా సమాచారంతో వారిని సోదా చేయగా వారి వద్ద ఉన్న బ్యాగులో గంజాయి లభించినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. లిఖేష్‌తో పాటు బాలుడిపై కేసు నమోదు చేసి వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్, మెట్‌పల్లి డీఎస్పీ అడ్డూరి రాములు, కోరుట్ల సీఐ సురేష్‌బాబులు అభినందించారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా గన్నేరువరం



ఖాసింపేట మానసాదేవి ఆలయం

- మండలానికి పెద్ద సంఖ్యలో వస్తున్న భక్తులు
- సౌకర్యాలు కల్పించాలని డిమాండ్

గన్నేరువరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతమైన గన్నేరువరం మండలం ఆధ్యాత్మిక కేంద్రంగా రూపాంతరం చెందుతోంది. మండలంలో ఆలయాలకు భక్తుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. మానేరు డ్యాంను ఆనుకుని ఉన్న గన్నేరువరం మండలంలో సౌకర్యాలు కల్పిస్తే మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. మండలంలోని అరుదైన ఆలయాల గురించి తెలుసుకుందాం..

• మానసాదేవి ఆలయం..

మండలంలోని ఖాసింపేటలో స్వయంభువుగా వెలసిన పవిత్రమైన ఆలయం మానసాదేవి ఆలయం. భారతదేశంలో ఈ ఆలయం మొదటిది హరిద్వార్‌లో ఉండగా రెండోది ఖాసింపేటలో ఉంది. పూర్వం ఈ ప్రాంతంలో వీరభద్రస్వామి ఆలయం ఉండేది. వీరభద్రస్వామి ఆలయ సమీపంలో వ్యవసాయ పనులు చేస్తుండగా మానసాదేవి అమ్మవారి విగ్రహం లభించింది. ఈ విగ్రహం సుమారు 800సంవత్సరాల పురాతనమైందని గ్రామస్థులు నమ్ముతారు. ఆలయంలోని కోనేటిలో ఉన్న 108 శివలింగ జంటనాగ ప్రతిమలు ఉన్నాయి. భక్తులు నీటితో ఈ విగ్రహాలకు అభిషేకం చేస్తారు. ఇది సర్పదోష నివారణకు సహాయపడుతుందని భక్తుల నమ్మకం. ఈ ఆలయం భక్తుల కోరికలను నెరవేర్చే పవిత్ర స్థలంగా ప్రసిద్ధి చెందింది. ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో భక్తులు అధికంగా వస్తారు.

• మైలారం మల్లికార్జునస్వామి ఆలయం

మండలంలోని మైలారం గ్రామశివారులో గుట్టపై మల్లికార్జునస్వామి ఆలయం ఉంది. ఆలయ పరిసరాలు గుట్టలు, మానేరు డ్యాంతో ఆహ్లాదభరితంగా ఉంటాయి. ఈ ఆలయానికి ఆది, బుధవారాల్లో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వచ్చి బోనాలు సమర్పించి పట్నాలు వేసుకుంటారు. ఆలయం చుట్టూ నల్ల పోచమ్మ గుడి, ఎల్లమ్మ గుడి, నవగ్రహాల ఆలయం, సమ్మక్క సారలమ్మలు కొలువై ఉన్నారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరిలో స్వామివారి కల్యాణం, పెద్దపట్నాలు, జాతర వైభవంగా నిర్వహిస్తారు. గుట్ట చుట్టూ గిరి ప్రదక్షిణ చేయడానికి ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

• పారువెల్ల లక్ష్మీగణపతి ఆలయం

మండలంలోని పారువెల్ల గ్రామంలో స్వయంభువుగా వెలసిన లక్ష్మీగణపతి ఆలయం ఉంది. ఆలయంలో స్వామివారికి తన మనసులోని కోరికను తలుచుకొని ముడుపుకడితే నెరవేరుస్తాడని భక్తుల నమ్మకం. ఇక్కడ పలువురు రాజకీయ నాయకులు ముడుపులను కట్టి గెలిచాక మొక్కులు చెల్లించుకున్న సందర్భాలు ఉన్నాయి. ఆలయంలో ప్రతి సంకష్టహర చతుర్థి రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తుంటారు.

• 400 ఏళ్ల చరిత్ర గల లక్ష్మీనరసింహస్వామి ఆలయం

మండల కేంద్రం గన్నేరువరంలో పురాతనమైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతోంది. ఈ ఆలయం కాకతీయుల కాలంలో సుమారు 400సంవత్సరాల క్రితం మొత్తం రాతితో నిర్మించారు.. ప్రతిఏటా చైత్ర పౌర్ణమి రోజున స్వామివారికి కల్యాణం, మరుసటి రోజు రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ప్రతినిత్యం అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



పారువెల్ల లక్ష్మీగణపతి ఆలయం



మైలారంలోని మల్లికార్జునస్వామి ఆలయం



గన్నేరువరంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం

ఎస్సారార్ కళాశాలలో బ్యూటీషియన్ సర్టిఫికెట్ కోర్సు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ కళాశాలలో బ్యూటీషియన్ కోర్స్ పూర్తిచేసిన 14వబ్యాచ్ విద్యార్థినులకు గురువారం సర్టిఫికెట్ ప్రదానంచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లాకోర్టు న్యాయవాది పి కళ్యాణి మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ఎదగడానికి ఈ బ్యూటీషియన్ సర్టిఫికెట్‌కోర్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మహిళలు పురుషులతో సమానంగా ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట్ల రామకృష్ణ మాట్లాడుతూ ఈనాటి సమాజంలో బ్యూటీషియన్ రంగంలో అవకాశాలు అపారంగా ఉన్నాయని తెలిపారు. ఈ సర్టిఫికెట్ ఈ విద్యార్థినులకు చాలా ఉపయోగపడుతుందని తెలిపారు.

కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ ఏ జ్యోతి లక్ష్మి, రిసోర్స్‌పర్సన్ ఆర్ లీనా, నితిన్,రాజయ్య, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ శ్రీనివాస రెడ్డి, హరిజోత్ కౌర్, జువాలజీ హెచ్‌ఓడి కిరణ్మయి, ఏవో ఉమారాణి, అర్చన కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



బ్యూటీషియన్ కోర్సు విద్యార్థినులకు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్

టీపీసీసీ పరిశీలకుల నియామకం

● కరీంనగర్ జిల్లాకు నమిండ్ల శ్రీనివాస్, పిన్నింటి రఘునాథ్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ జిల్లా పరిశీలకులను ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ నియమించారు. కరీంనగర్ జిల్లాపరిశీలకులుగా టీపీసీసీ సీనియర్ నాయకులు నమిండ్ల శ్రీనివాస్, పిన్నింటి రఘునాథ్‌రెడ్డిలను నియమించారు. రానున్న కాంగ్రెస్‌పార్టీ సంస్థాగత ఎన్నికలను గ్రామశాఖ కాంగ్రెస్, డివిజన్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్, బ్లాక్ కాంగ్రెస్, జిల్లా కాంగ్రెస్ పార్టీల అధ్యక్షుల నియామకం కోసం స్థానిక క్యాడర్‌తో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించి, నివేదికను ఏఐసీసీ ఇన్‌చార్జికి అందజేయాల్సి ఉంటుంది.

● జగిత్యాల జిల్లా పరిశీలకులుగా వైద్యుల అంజన్‌కుమార్

జగిత్యాలజిల్లా పరిశీలకులుగా టీపీసీసీకార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్‌ను నియమిస్తూ ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ ఆదేశాలు జారీచేశారు. అలాగే ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను నిజామాబాద్ జిల్లాకు, టీపీసీసీఅధికారప్రతినిధి మేన్నేని రోహిత్ రావును సిద్ధిపేట జిల్లా పరిశీలకులుగా నియమించారు.

బాధ్యతలు చేపట్టిన పర్సనల్ ఆఫీసర్

భగత్‌నగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకరీంనగర్ రీజియన్ పర్సనల్‌ఆఫీసర్‌గా జి సత్యనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం రీజినల్ మేనేజర్ బి రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్ భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగబాధ్యతలు స్వీకరించిన జి సత్యనారాయణను పర్సనల్ ఆఫీసర్ కార్యాలయ అసిస్టెంట్‌మేనేజర్ సత్తయ్య, సూపరింటెంట్ శ్రీనివాస్, సుజాత,వైఎల్‌నారాయణశుభాకాంక్షలు తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

మల్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంను ఎత్తుకెళ్లారు. గుండేటి పవన్ అనే యువకుడు ద్విచక్ర వాహనాన్ని బుధవారంరాత్రి మార్కండేయ ఆలయం సమీపంలోని తమ ఇంటిముందు నిలిపి తాళంవేశాడు. గురువారం ఉదయం చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నాయకుల వేధింపులు భరించలేకనే అజ్ఞాతంలోకి..

● సిరిసిల్ల పోలీస్ స్టేషన్లో కార్యదర్శి మంత్రి ప్రియాంక



సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న కార్యదర్శి మంత్రి ప్రియాంక

తంగళ్లపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బానిస లాగా పనిచేయాలి.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తామని, నిబంధనల విరుద్ధంగా తమకు నచ్చిన విధంగా పనిచేయాలంటూ నాయకుల వేధింపులు భరించలేక అజ్ఞాతంలోకి వెళ్లానని తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి మంత్రి ప్రియాంక వెల్లడించారు. రెండు రోజుల క్రితం కార్యదర్శి అదృశ్యం కాగా పోలీసుల సహకారంతో కుటుంబ సభ్యులు తిరుపతిలో ఉన్నట్లు గుర్తించారు. ప్రియాంకను తీసుకొని గురువారం సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కార్యదర్శి ప్రియాంక విలేకరులతో మాట్లాడుతూ నలుగురు వ్యక్తులు శ్రీకాంత్, అభినయ్, మల్లేష్‌బాబు, రాజు తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, వారి వేధింపులు భరించలేక చెప్పాపెట్టకుండా వాట్సాప్‌లో రాజీనామా లెటర్ పంపి వెళ్లిపో యినట్లు తెలిపారు. నిజాయితీగా పనిచేయలేని పరిస్థితి కల్పిస్తుండడంతో ఉద్యోగం మానేసి దూరంగా వెళ్లిపోవాలని నిర్ణయించుకొని తిరుపతికి వెళ్లినట్లు తెలిపింది. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక కమిటీలో సభ్యులుగాఉన్న మల్లేష్‌బాబు, అభినయ్, శ్రీకాంత్‌గౌడ్‌లు అనర్హులను ఎంపిక చేయాలని తీవ్రఒత్తిడికి గురిచేశారన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం ఇంకుడు గుంతల బిల్లులు ఇవ్వాలని మల్లేష్‌బాబు తీవ్ర ఒత్తిడికి గురిచేశాడని ఆరోపించారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. వేధింపులు భరించలేకనే రాజీనామా పత్రాన్ని వాట్సాప్ ద్వారా పంపించి తిరుపతికి వెళ్లిపోయానన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనే ఏదైనా ఉద్యోగం చూసుకొని కుటుంబ సభ్యులకు నిదానంగా చెబుదామని నిర్ణయించుకుని వెళ్లినట్లు తెలిపారు.

కలకలం రేపుతున్న మరణాలు..

- ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య
- మరొకరి అనుమానాస్పద మృతి

గంబీరావుపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా గంబీరావుపేట మండలం గజసింగవరంలో గ్రామంలో ఒకరు ఆత్మహత్య చేసుకోగా, మరొకరు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఇద్దరు ఒకేఇంట్లో మృతిచెందడం అనుమానాలకు తావిస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గజసింగవరంలో గ్రామానికి చెందిన ఉల్లి శ్రీకాంత్(35) తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీకాంత్ ఇంటికి సమీపంలో ఉండే చెరుకూరి రేఖ(30) కూడా అదే ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీకాంత్ తల్లిదండ్రులు ఇంటికి చేరుకునేసరికి కొడుకు ఉరివేసుకుని ఉండడంతో కేకలువేశారు. దీంతో ఇరుగు పొరుగు వారు చేరుకుని చూసే సరికి శ్రీకాంత్ ఉరివేసుకుని మృతిచెంది ఉండగా, అదే ఇంట్లో రేఖ అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉంది. మధ్యాహ్నం నుంచి రేఖ కనిపించడం లేదని, ఆమెకోసం గాలిస్తున్న బంధువులకు సమాచారం అందించారు. రేఖ భర్త బతుకుదెరువు నిమిత్తం గల్ఫ్‌లో ఉంటున్నాడు. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ గౌడ్, స్థానికఎస్ఐ ప్రేమానందం సంఘటన వద్దకు చేరుకుని, మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి వుషా ఛాంపియన్ షిప్ పోటీలు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : అమేచ్యూర్ వుషా జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయిలో 3వ తెలంగాణ సబ్ జూనియర్స్ అండ్ జూనియర్స్, 2వ తెలంగాణ సీనియర్స్ వుషా పోటీలను నిర్వహిస్తున్నట్లు గురువారం అమేచ్యూర్ వుషా జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ రవితేజ, ప్రధాన కార్యదర్శి బీ అఖిల, కోశాధికారి వీ భవాని తెలిపారు. ఏప్రిల్ తేది 26నుంచి 28 వరకు సిరిసిల్ల పట్టణం పద్మనాయక కళ్యాణ మండపంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి(ఇంటర్ డిస్ట్రిక్)సబ్ జూనియర్స్, జూనియర్స్ సీనియర్స్ విభాగాలలో పోటీలు జరుగుతాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఎస్‌యూలో మూడో రోజుకు చేరిన సమ్మె



ఎస్‌యూలో నిరవధిక సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్, పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్స్

గణేశ్‌నగర్,ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్‌టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని చేపట్టిన సమ్మె గురువారం మూడోరోజుకు చేరుకుంది. సైన్స్ కళాశాల రసాయనశాస్త్ర విభాగవిద్యార్థులు తమ మద్దతుప్రకటించి వారితోపాటుకూర్చుని వారికి సంఘీభావం తెలిపారు. ఈ సమ్మె శిబిరాన్ని సందర్శించిన నలంద డిగ్రీ కాలేజ్, జగిత్యాల ప్రిన్సిపాల్ శ్రీపాదనరేష్, రామకృష్ణడిగ్రీ కళాశాల, జగిత్యాల ప్రిన్సిపల్ రాజేందర్, రామకృష్ణ డిగ్రీకళాశాల, కోరుట్లప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్‌ఒప్పంద సహాయఆచార్యుల డిమాండ్స్ న్యాయమైనవని పూర్తి మద్దతు తెలిపారు.

నరసింహుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు

ధర్మపురి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, ల్యాండ్ అక్వేషన్ జాయింట్‌డైరెక్టర్ ఉమామహేశ్వర్ దంపతులు వేర్వేరుగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి వేర్వేరుగా వేదపండితులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ నేతృత్వంలో ఆలయ ముఖ్య అర్చకులు సీహెచ్ రమణాచారి, నంబి నరసింహమూర్తి, అర్చకలు వారందరిని వేర్వేరుగా ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ వారందరికి వేర్వేరుగా స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు బొల్లారపు పోచయ్య, కొమురవెల్లి పవన్‌కుమార్, మందుల మల్లేష్, రాపర్తి సాయికిరణ్, స్తంభంకాడి గణేష్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బద్దం లింగారెడ్డి, కన్నం అంజయ్య, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాంబాబుసిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.





జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డికి స్వామి, ల్యాండ్ అక్వేషన్ జాయింట్ డైరెక్టర్ ఉమామహేశ్వర్ దంపతులకు శేషవసతిం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పీఏపై కేసు నమోదు

హుజూరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రభుత్వ పీఏ శివరాంపై బుధవారం అర్ధరాత్రి డ్రంకెన్ డ్రైవ్‌లో కేసునమోదైనట్లు పోలీసులు తెలిపారు. హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద రూరల్‌సీఐ పులి వెంకట్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే పీఏ శివరాం కారును నడుపుకుంటూ వస్తుండగా, పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా, ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో పోలీసులు కారును వెంబడించి కేసీ క్యాంపు లో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. డ్రంకెన్‌డ్రైవ్ టెస్టు చేయగా, మద్యం తాగినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో శివరాంపై డ్రంకెన్‌డ్రైవ్ కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వడదెబ్బతో రైతు మృతి



గంగారాం(ఫైల్)

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా జగిత్యాల మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన కొల్లూరి గంగారాం (65) అనే రైతు గురువారం వడదెబ్బతో మృతిచెందాడు. గంగారాం గోపాల్ రావుపేట గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం పొలంలో వరిని కోత కోయిస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. బంధువులు జగిత్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి గంగారాం మృతిచెందాడు. మృతుడికి భార్య రాజవ్వ , కుమారులు రాజశేఖర్, రాజు, కూతురు కవిత ఉన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువులో బుధవారం మునిగిన పట్టణంలోని మంచినీళ్లబావి ప్రాంగణానికి చెందిన నీలి మల్లికార్జున్ మృతదేహం లభ్యం అయినట్లు టౌన్ ఎస్సై మన్మధరావు తెలిపారు. బుధవారం చెరువులో స్నానానికి వెళ్లి గల్లంతు కాగా పోలీసులు గజ ఈతగాళ్లతో వెతికించగా గురువారం ఉదయం మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సారార్ కళాశాలలో జాబ్ మేళాకు స్పందన

గణేశ్‌నగర్,ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో గురువారం స్వాన్ బిజినెస్ సర్వీస్ కంపెనీ, కళాశాల టిఎస్‌కెసి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేషస్పందన వచ్చిందని కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ తెలిపారు. జాబ్ మేళాలో 64 మంది విద్యార్థులు పాల్గొనగా 34 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ టి.రాజయ్య, విద్యార్థులను అభినందిస్తూ, ఇలాంటి జాబ్ మేళాలో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు ఇంటర్వ్యూ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయని తెలిపా రు.ఈ కార్యక్రమంలో స్వాన్ బిజినెస్ సర్వీస్ కంపెనీ ఎండి మణిదీపక్,టిఎస్‌కెసి కోఆర్డినేటర్ పి రాజేష్, కళాశాల ఐక్యూఏసి కోఆర్డినేటర్ హర్ జ్యోత్ కౌర్ తదితారులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో సర్టిఫికేట్‌లతో ఎంపికైన విద్యార్థులు

సంక్షిప్త సమాచారం

● ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ కూలీలు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని రైతులకు వైద్యాధికారి సరియాఅంజుమ్ ఆధ్వర్యంలోని సిబ్బంది గురువారం ఓఆర్ఎస్ ప్యాకెటను అందజేశారు. వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నీరు అధికంగా తీసుకోవాలని సూచించారు. స్పృహ కోల్పోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, చెమటలు పట్టడం, జ్వరం, నీరసం లాంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండలంలోని ప్రాథమిక ఆరోగ్యఉప కేంద్రంలో గురువారం క్షయ వ్యాధిగ్రస్తులకు, కుటుంబసభ్యులకు(లేటేంట్ టీబి) పరీక్షలను నిర్వహించారు. మండల వైద్యధికారి డాక్టర్ బత్తుల గీతాంజలి, సినియర్ ల్యాబ్ సూపర్‌వైజర్ కె నాగరాజు, టిబి సూపర్ వైజర్ ప్రసాద్, హెచ్‌వో యాదగిరి, ల్యాబ్ టెక్నిషియన్ ప్రవీణ్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : వరంగలో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజోత్సవ సభకు పెద్దఎత్తున హాజరుకావాలని పార్టీ ముస్తాబాద్ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, మాజీ మండల అకోఅప్షన్ మెంబర్ అన్వర్ పాషా, నాయకులు సందుపట్ల చిన్న అంజిరెడ్డి, పల్లె సత్యంగౌడ్ పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానుషమని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాహెబ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో ఆయన గురువారం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే ఉగ్రవాదులు అమాయక ప్రజలను బలి తీసుకున్నారని అన్నారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, మహబూబ్, సాయి, ప్రేమ్, పర్శరాములు, బాబయ్య తదితరులు ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట : గత బీఆర్ఎస్ ప్రభుత్వ తీరు వల్లే రైతులు పండించిన ధాన్యం సేకరణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని కొనుగోళ్లు, ధాన్యం తరలింపును వేగవంతం చేస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి డబ్బులు చెల్లిస్తోందన్నారు. అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, బుచ్చాగౌడ్, బాల్‌రెడ్డి, రాజ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్ ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట బీజేపీ అధ్యక్ష పదవి కోసం ఆ పార్టీ కరీంనగర్ పార్లమెంటు కో-కన్వీనర్, ఎన్నికల అధికారి రవీందర్ గురువారం నామినేషన్ల ప్రక్రియను చేపట్టారు. మొత్తం 23 మంది తమ నామినేషన్లను సమర్పించారని రవీందర్ పేర్కొన్నారు. నామినేషన్లను పరిశీలన, ఎన్నిక ప్రక్రియను పార్టీ ఆదేశాల మేరకు పూర్తి చేయనున్నామని వివరించారు.

● గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట : గంభీరావుపేట మండలం పెద్దమ్మ ఆటవీ ప్రాంతంలో మూగజీవాలకు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని సత్యసేవా సమితి ఆధ్వర్యంలో గురువారం పండ్లు, మంచినీరు అందజేశారు. భగవాన్ సత్యసాయిబాబా ఆరాధన దినోత్సవం సందర్భంగా మూగ జీవాలకు అరటి పండ్లు ఇచ్చి, తొట్లతో ట్యాంకర్ల ద్వార నీటిని పోశారు. సేవా సమితి కన్వీనర్ కూర రవి, సభ్యులు కొండ రమేష్‌బాబు, బిక్షపతి, శ్రీనివాస్, దేవేందర్, హర్షవర్ధన్, దేవేంద్ర, స్పందన, స్వరూప, స్వప్న తదితరులు ఉన్నారు.

● ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం రోజున తెలంగాణా ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తీసుకువచ్చిన భూభారతి, కొత్త ఆర్‌వోఆర్ చట్టాలపై అవగాహన కల్పించనున్నట్లు తహసీల్దార్ సురేశ్ తెలిపారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమానికి రైతులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

● ఇల్లంతకుంట : పౌరుల హక్కుల రక్షణకు పాటుపడాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ మిట్టపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో గురువారం మండల చైర్మన్ కాసుపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. వైస్‌చైర్మన్‌గా గంగం అనీల్, ప్రధాన కార్యదర్శిగా పినకాసి మనోహర్, సహాయ కార్యదర్శులుగా కాసుపాక బాబు, నారెడ్డి రాజశేఖర్‌లను ఎన్నుకున్నారు.

● ఇల్లంతకుంట : మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఉచిత మజ్జిగ కేంద్రాన్ని యువజన సంఘాల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి ప్రారంభించారు. బీటీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేశారు. బొల్లారం ప్రసన్నకుమార్, కర్ల అరుణ్, గజ్జల శ్రీనివాస్, కంచె మహేందర్, ఎల్లంకి శ్రీనివాస్, నవీన్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక వైద్యశిబిరం కొనసాగింది. పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేసేందుకు అన్ని గ్రామాలలో ప్రత్యేక వైద్యశిభిరాలను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఏఎన్ఎమ్‌లు స్వప్న, సుహాసిని, ఆశాకార్యకర్తలు గొర్రె లక్ష్మి, అనంతలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : అదానీ సంస్థలో భాగమైన సందర్భంగా రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధికి 2లక్షల రూపాయల విలువగల తమ మొదటి సిమెంటు బస్తాల లోడ్‌ను బిర్లా ఏ1-అదానీ సంస్థ ప్రతినిధులు గురువారం ఆలయ అధికారులకు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి కె.వినోద్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సంస్థ ప్రతినిధులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలంలోని కొండాపూర్‌కు చెందిన కోనరావుపేట సింగిల్‌విండో మాజీ చైర్మన్ కేతిరెడ్డి లక్ష్మారెడ్డి గుండెపోటుతో మృతిచెందగా ఆయన కుటుంబాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం పరామర్శించి నివాళులర్పించి సంతాపాన్ని వ్యక్తంచేశారు. కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, కాంగ్రెస్ నాయకులు నందు గౌడ్, నాలుక సత్యం, రుక్మిణి, పల్లె రవీందర్ రెడ్డి, అబ్దుల్ రషీద్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, డైరెక్టర్ నాయిని ప్రభాకర్‌రెడ్డి, ఇట్టిరెడ్డి రాజిరెడ్డి, మాజీ సింగిల్‌విండో చైర్మన్ ముకుంద రెడ్డి, నల్ల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు ఈనెల 27న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శివకుమార్‌రెడ్డి తెలిపారు. ప్రవేశ పరీక్షలు రాసే విద్యార్థులు హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి, 7-10 తరగతి ప్రవేశ పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు.

● బోయినపల్లి : మండలంలోని విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏఐఎఫ్ అమెరికన్ ఇండియా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ తరగతులను ప్రారంభమయ్యాయి. పాఠశాల హెచ్ఎం బొలగం శ్రీనివాస్ మాట్లాడుతూ 24నుంచి మే23 వరకు కొనసాగుతాయన్నారు. ఏఐఎఫ్ కోఆర్డినేటర్ శైలజా, ఆంగ్ల ఉపాధ్యాయుడు కట్ట వెంకట హనుమాన్ పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండలకేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మండల కేంద్రానికి చెందిన సాజిత్(40) కాలి నడకన వస్తుండగా, నర్మాలకు చెందిన వ్యక్తి ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. సాజిత్ తలకు తీవ్రగాయమవ్వడంతో ఎల్లారెడ్డిపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు.సాజిత్ గంభీరావుపేట మండలకాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్‌కు సోదరుడు.

'భూ భారతి'తో భూ సమస్యల పరిష్కారం

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

గంభీరావుపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ సాదాబైనామా దరఖాస్తులు నూతన ఆర్వోఆర్ చట్టం భూ భారతిలో పరిష్కారం అవుతాయని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద గురువారం నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను కలెక్టర్ ఈసందర్భంగా రైతులకు వివరించారు. రెవెన్యు వ్యవస్థను బలోపేతం చేసేందుకు గ్రామాల్లో పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మనిషికి ఆధార్ కార్డులాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక చేస్తుందని, దీని ద్వార భూ అక్రమాలకు చెక్ పెట్టవచ్చని స్పష్టం చేశారు. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్లపై భూ భారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, రెవెన్యు డివిజన్ అధికారి నిర్ణయంపై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై భూమి ట్రిబ్యునల్ వద్ద అప్పీల్ చేసుకొవచ్చని గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైన అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్ళాల్సి ఉండేదన్నారు. రెవెన్యు రికార్డులను తయారు చేసి ప్రతి సంవత్సరం గ్రామంలో డిస్‌ప్లే చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయ, తహసీల్దార్ మారుతిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి ప్రతిష్ఠాపనోత్సవాలు

గంభీరావుపేట, ఎప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం కోళ్ళమద్దిలో స్థానిక ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న పెద్దమ్మ తల్లి ప్రతిష్ఠ మహోత్సవాల్లో గురువారం నాఫ్స్‌కాప్ చైర్మెన్ కొండూరు రవీందర్‌రావు పాల్గొన్నారు. పెద్దమ్మ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈనెల 21 నుంచి ప్రారంభమయ్యాయి. హోమం, పోచమ్మతల్లికి భోనాలు తదితర కార్యక్రమాలు కొనసాగాయి. అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా గురువారం పెద్దమ్మ-పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. అమ్మవారి కల్యాణం అత్యంత వైభవంగా సాగింది. నాఫ్స్‌కాప్ చైర్మెన్ కొండూరు రవీందర్‌రావు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు వెంకటస్వామి, మాజీ సర్పంచ్ కేశవరావు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శాత్రబోయిన దేవయ్య, శాత్రబోయిన లక్ష్మన్, దయాకర్‌రావు, లక్ష్మన్, మల్లేశం, ప్రశాంత్, బాలరాజు, శాత్రబోయిన రాజు, శ్రీనివాస్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవంలో పాల్గొన్న రవీందర్‌రావు

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి


దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

కోనరావుపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్‌లో గురువారం వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, కెంద గంగాధర్, గోపు పరశురాములు, సిద్ధంశెట్టి శ్రీనివాస్, పాక్స్ చైర్మన్లు బండ నర్సయ్య, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా చర్చ..

(3వ పేజీ తరువాయి)

సెస్ అభివృద్ధి వైపు వెళ్తుంటే విద్యుత్ చౌర్యం ఆర్థిక పరిపుష్టిని బలహీనపరుస్తుందన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా 99,535 మంది వినియోగదారులకు లబ్ధి జరిగిందని రూ.4.08 కోట్లు సబ్సిడీ ఇచ్చామన్నారు. వ్యవసాయ బావులకు విద్యుద్దీకరణతో పాటు జిల్లాలో 76 విద్యుత్ ఉపకేంద్రాలు ఉండగా, మరో 12 అదనంగా ఏర్పాటు చేస్తామన్నారు. మరో 6 అదనంగా సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. జిల్లాలో 132/33 కేవీ కేంద్రాలు 6 ఉండగా, నేరేళ్ల, బోయినపల్లిలో ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు.

● అనధికారిక సర్వీస్‌లు క్రమబద్ధీకరించుకోవాలి..

- సెస్ ఎండీ విజయేందర్‌రెడ్డి

అనధికారిక విద్యుత్ సర్వీస్‌లను క్రమబద్ధీకరించుకోవాలని, సంస్థ ప్రగతికి సహకరించాలని సెస్ ఎండీ విజయేందర్‌రెడ్డి కోరారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తోందని, కానీ సెస్ పరిధిలో అనధికారిక, అధికలోడ్ కలిగిన వ్యవసాయ సర్వీస్‌లు ఉండడం వల్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తరచుగా కాలిపోతున్నాయని అన్నారు. సంస్థకు, రైతాంగానికి నష్టం కలుగుతుందని, దీనిని నివారించడానికి ప్రతినిధులు వినియోగదారులను చైతన్యపరిచి సర్వీస్‌లను క్రమబద్ధీకరించుకునేలా చేయాలని కోరారు.

ముస్తాబాద్‌లో స్వర్ణకారుల రిలే దీక్ష

ముస్తాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఎదుట స్వర్ణకారులు గురువారం రిలేదీక్ష చేపట్టారు. చేతి వృత్తిపై ఆధారపడే తాము మండల కేంద్రంలోని పెద్దపెద్ద జ్యువలరీ షాప్‌లు పెడితే ఉపాధి దెబ్బతిని రోడ్డున పడుతామని ఆవేదన వ్యక్తం చేశారు. జువెల్లరీ షాపు పనులు బంద్ అయ్యేంతవరకు తాము రిలేదీక్షలు చేపడుతామని హెచ్చరించారు. స్వర్ణకారులు చింతోజు బాలయ్య, చింతోజు రవి, చింతోజు ఈశ్వరయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు. వివిధ పార్టీల నాయకులు స్వర్ణకారులకు మద్దతు తెలిపారు.

ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సత్యం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని విద్యార్థులు శ్రీనిధి, రిహాన్‌లను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం ఘనంగా సన్మానించారు. విద్యార్థుల తల్లిదండ్రులు రజిత, బాలరాజుయాదవ్, రఫీక్, నాయకులు నరసయ్య, లక్ష్మారెడ్డి, సత్యనారాయణ, రామ్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేందర్‌బాబు, లక్ష్మీనారాయణ, సంతోష్, వెంకటేష్ మల్లేశం, గోపాల్ ,రాములు, లింగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిపై నిరసనల వెల్లువ


సంతాప సూచకంగా మౌనం పాటిస్తున్న న్యాయవాదులు


ఎల్లారెడ్డిపేటలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు


వేములవాడలో..

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్ముకాశ్మీర్‌లో పహల్గాం ప్రాంతంలో భారత పౌరులపై ముష్కరులు అమానుషంగా దాడిచేసి అనేకమందిని కాల్చి చంపడాన్ని నిరసిస్తూ వారి దుశ్చర్యలను ఖండిస్తూ సిరిసిల్ల కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అమరులైన వారికి సంతాప సూచకంగా న్యాయవాదులు రెండు నిమిషాలు మౌనం పాటించి నిరసన తెలిపి కోర్టు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముష్కరుల దాడిని ఖండిస్తూ చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ దుండగులను కేంద్ర ప్రభుత్వం వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటి, ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ రాజమల్లు, క్రీడల కార్యదర్శి రమేశ్, గ్రంధాలయ కార్యదర్శి శరత్‌కుమార్, మహిళా ప్రతినిధి పుష్పలత, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలోని నాయకులు గురువారం నిరసనకు దిగారు. స్థానిక పాత బస్టాండు ప్రాంతంలోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఉగ్రమూకల దిష్టిబొమ్మను దహనం చేశారు. పర్యాటకులను దారుణంగా కాల్చి చంపడం దురదృష్టకరమన్నారు. హిందువులంతా ఐక్యమై తీవ్రవాదాన్ని తిప్పికొట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కో-కన్వీనర్ రవీందర్, నాయకులు తిరుపతి, బుగ్గారెడ్డి, లక్ష్మారెడ్డి, గణేశ్, రామచంద్రారెడ్డి, రాజిరెడ్డి, నరేశ్, స్వామి, రంజిత్‌కుమార్, సాయికుమార్, రవి, కుమార్, రవీందర్, శ్రీనివాస్, రాజు, ఆంజనేయులు, ప్రదీప్‌రెడ్డి, కిరణ్‌నాయక్, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : జమ్ముకాశ్మీర్ పహల్గాంలో హిందువులపై జరిగిన దాడికి నిరసనగా నంది కమాన్ వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చింతపల్లి వెంకటేశ్వర్‌రావు, సీనియర్ నాయకులు లింగంపల్లి శంకర్, ఏరెడ్డి రాజిరెడ్డి, గుండెకర్ల లక్ష్మణ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జింక అనీల్, మండల ఉపాధ్యక్షులు బిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జింక శ్రీనివాస్, కార్యదర్శులు కొలనూరి సంజీవరెడ్డి, చొక్కాల మధు, కోశాధికారి సోలంకి అరవింద్, బూత్ అధ్యక్షులు సిల్వేని ప్రశాంత్, గణేష్, కంసాని రాము, చింతకుంట నర్సయ్య, పోచంపల్లి శ్రీకాంత్, ముదం శ్రీనివాస్, ముడికె రాములు, చెర్ల దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని నిర్వహిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ మండల కన్వీనర్ గణేష్ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాది దాడిలో సుమారు 27 మంది మృతిచెందారని అన్నారు. ఉగ్రవాదులను పట్టుకొని కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరారు. ఏబీవీపీ నాయకులు పాక చరణ్, చల్ల అభినయ్ తదితరులు ఉన్నారు.

● సిరిసిల్ల రూరల్ : పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు అమానుషంగా చంపడాన్ని సీపీఎం రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. మృతులకి నివాళులు అర్పించారు, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. సీపీఎం ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం రాత్రి పహల్గామ్ ఉగ్రదాడులను ప్రాణాలు కోల్పోయిన వారికి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్‌లో పర్యటించడానికి వెళ్లిన సందర్శకులని ఉగ్రవాదులు కాల్చి చంపడం హేయమైన చర్య అని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కోడం రమణ జిల్లా కమిటీ సూరం పద్మ, సీపీఎం నాయకులు మిట్టపల్లి రాజమల్లు, సిరిమల సత్యం, నక్క దేవదాస్, కుమ్మరికుంట కిషన్, బేజిగం సురేష్, ఎలిగేటి శ్రీను, బాస శ్రీధర్, రామచంద్రం, ఉడుత రవి, వడ్డేపల్లి గోవర్ధన్, సందుపట్ల పోచమల్లు, బింగి సంపత్, ప్రసాద్ పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : పహల్గం ఉగ్రదాడిలో మరణించిన వారి కుటుంబాలకు సంఘీబావం తెలుపుతూ రాజరాజేశ్వరస్వామి ఆలయ ఉద్యోగుల సంఘం సభ్యులు కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు కూరగాయల శ్రీనివాస్, వరి నర్సయ్య, ఓ.భాస్కర్,జి రమణమూర్తి, నరేందర్, శ్యామ్, రామ్ కిషన్‌రావు, మహిపాల్‌రెడ్డి, లచ్చయ్య, సంజీవరావు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది గణేష్, శ్రీనివాస్, శివ, సాగర్, ఎస్పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


శాంతియుత ర్యాలీలో పాల్గొన్న రాజన్న ఆలయ ఉద్యోగులు

కేసీఆర్ పాలనలో ప్రజలకు ఆత్మగౌరవం..

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో ప్రజలు ఆత్మగౌరవంతో బ్రతికారని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం బీఆర్ఎస్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు గులాబీ జెండనే తెలంగాణ ప్రజలకు అండ అన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ హామీలను అమలు చేయడంలో విఫలం చెందిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు, బలహీనవర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, నేడు రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఈనెల 27న జరిగే రజతోత్సవ సభకు ఊరువాడ కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా అన్ని గ్రామాల నాయకులకు వాల్‌పోస్టర్లు, పార్టీ జండాను పంపిణీ చేశారు. జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, నాయకులు చెరుకుపల్లి రాజిరెడ్డి, బొల్లవేని రమేష్, ఉడుతల వెంకన్న, గుండ ముత్తయ్య, గొట్టెపర్తి పర్శరాం, కమటం రాములు, బిల్లవేని పర్శరాం, సావనపెల్లి అనీల్, రాగటి రమేష్, మల్లయ్య, కొమురయ్య, నాగరాజు, బర్ల తిరుపతి, దొంతుల శంకర్, చొప్పరి శ్రీధర్, పండుగ భాస్కర్, కనుకయ్య, తిరుపతి, రాజశేఖర్ పాల్గొన్నారు.

అదనపు నిధుల మంజూరు..

రుద్రంగి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా ఎమ్మార్సీ భవనం నిర్మాణం కొనసాగుతుంది. అయితే ఎమ్మార్సీ భవన నిర్మాణం కోసం 40 లక్షలు నిధులు మంజూరు కాగా నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయి. నిర్మాణం పూర్తికావడానికి మరికొన్ని నిధులు అవసరం కావడంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రూ.7 లక్షల 90 వెలు నిధులు మంజూరు చేశారు. నిధులు మంజూరు చేసినందుగాను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం

- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వంలో విద్యకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియేట్ పరీక్షా ఫలితాలలో రాష్ట్ర ర్యాంకులు సాధించిన వేములవాడ మైనార్టీ గురుకుల విద్యార్థులను ఆయన సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని అందులో భాగంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం, ఐటీఐలు, స్కిల్ యూనివర్సిటీల వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.

గత పదేండ్లలో ఎన్నడూ లేని విధంగా గురుకులాలల్లో డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలను పెంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, కళాశాల లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.